అడల్ట్స్ ఓన్లీ కథ

# మెరుపుతీగ

అమిరపు విష్ణుప్రియ

అర్థచంద్రాకారపు పనీర్ ముక్క లాంటి ఆమె నడుము ఒంపును చూస్తున్నకొద్దీ... అతనిలో ఆవేశం వెల్లువవుతోంది. వెన్నపూస లాంటి ఆ మెడ నునుపుదనం అతణ్ణి కవ్వించి, కోర్కె రేకెత్తిస్తోంది. అతడి కళ్లు వలపు వాకిళ్లై ఆమెకు ఆహ్వానం పలుకగా, ఆ ముదిత పెదవులు బెదురుతో, సన్నగా అదిరాయ్. దగ్గరగా వచ్చాడతగాడు. ఆ నెలవంక నడుముని సుతారంగా తాకాడు. అతడు తాకిన ఆక్షణం, ఆమె మదిలో పులకింతల పరవశం.

పూర్తిగా లీనమయిపోయి వారపత్రికను చదువుతున్న లహరి, తలుపు కొట్టిన చప్పుడికి ఉలిక్కిపడి లేచింది. తన చేతిలో ఉన్న పత్రికను గబుక్కున తలదిండు కింద దాచేసి, మంచం దిగి తలుపు తీసింది. ఎదురుగా అమ్మ.

''నిద్రపోతున్నావా లహరీ'' అని అడిగింది మహాలక్ష్మమ్మ. ఏం చెప్పాలో తెలియని అయోమయంలో తల నిలువుగానో, అడ్డంగానో ఊపేసింది లహరి.

''సరేగాని, అబ్బాయి కబురు పెట్టాడు... నిన్నోసారి చూడాలంటున్నాడు. రేపు ఒకసారి అలా సరదాగా పొలానికి వెళ్లిరా'' చెప్పింది మహాలక్ష్మమ్మ.

ఆ కబురు లహరికి మహదానందంగా ఉంది. కానీ దాన్ని పైకి కనబడనీయకుండా బెట్టుగా చూసింది.


''అతనికి చూడాలని ఉంటే మన ఇంటికే రావాలిగాని నేను వెళ్లడం ఏంటి?'' దీర్ఘం తీస్తూ అంది.

''బావని పట్టుకొని అతను, ఇతను అంటావేంటి. నీకిష్టం లేకపోతే చెప్పేయ్. నువ్వు రావని కబురు పెడతాను'' అని మహాలక్ష్మమ్మ చెప్పేసరికి ఎక్కడ నిజంగా కబురు పెడుతుందోనని లహరి కంగారు పడిపోయింది.

''సరేలే, వెళతానులే'' అంటూ తలుపు గడియ వేసుకుంది. రేపు బావని కలవబోతున్నాననే ఆలోచనలో ఆమె హృదయం ఉల్లాసంతో ఉప్పొంగింది. పత్రిక తెరిచి కథ చదవసాగింది.

ఇప్పటివరకూ పత్రికల్లో వచ్చే శృంగార కథలు చదవని ఆమెకు, బావతో పెళ్లి కుదిరిన తర్వాత తొలిసారిగా అలాంటి కథలు చదవాలనిపించింది. చిన్నప్పటినుంచీ అనుకున్న సంబంధమే అయినా, బావా మరదళ్ల ఇష్టాయిష్టాల్లో అనేక మార్పులు వస్తూ ఉంటాయి. కానీ వీరిద్దరి విషయంలో ఒకరి పట్ల మరొకరికి ఇష్టం ఏమాత్రం తగ్గలేదని, వయసుతో పాటు మరింత పెరిగి ప్రేమగా రూపాంతరం చెందిందని గ్రహించి, పెద్దలు ఈ ఇద్దరికీ పెళ్లి నిశ్చయం చేశారు. మంచి ముహూర్తం కోసం పెళ్లి వాయిదా పడుతూ వచ్చింది.

పెళ్లి అయ్యాక బావతో తొలి అనుభవాల అనుభూతులు, ఆరాటాలు ఎలా ఉంటాయోనని ఆమె



మనసు ఉవ్విళ్లూరసాగింది. అలాంటివి తెలుసుకోవాలంటే పత్రికల్లో కథలు చదవాలని, స్నేహితుల ఇళ్లల్లోని పాత పత్రికలన్నీ తెప్పించుకుంది. ఎవరికంటా పడకుండా, వాటిని ప్రతీరోజు రహస్యంగా చదివేస్తోంది.

ఆ తియ్యటి ఊహలతో తలమునకలయ్యే తరుణంలో బావ నుంచి కబురు రావడంతో మనసు మయూరామే అయి, నాట్యం చేయసాగింది. మధురోహలు తూనీగల్లా కమ్ముకుంటుంటే, అప్రయత్నంగా పత్రిక పక్కనే పడేసింది. ఊహల మత్తులో ఆమె కళ్లు అరమోడ్పులయ్యాయి.

★ ★ ★

సాయంత్రం ఐదు గంటల సమయం.

సంధ్యాకాంత కెంజాయరంగు చీరలో మెరిసిపోతోంది. అల్లరి మలయమారుతం ఆగాగి వీస్తోంది.

దూరంగా ఏదో ఎడ్లబండి వస్తున్నట్టు కనిపించేసరికి, బండిమీద ఎవరో లీలామాత్రంగా కనిపిస్తుంటే, ఆ వచ్చేది ఎవరా అనుకుంటూ చూడసాగాడు మురళి.

కాసేపటికి దృష్టిపథంలోకి వచ్చిన ఎడ్లబండి మీద తన అందాల మరదలు పిల్ల కనిపించేసరికి, అతడి కళ్లలో ఆనందపు మెరుపు మెరిసింది. మనసులో తియ్యటి భావాలు చెలరేగగా తింటున్న చెరకు గడను విసిరికొట్టి, చేలకు నీళ్లు పెడుతున్న పంపు దగ్గర చేతులు కుడుక్కున్నాడు.

బావ వైపు అలవోకగా చూస్తూ వయ్యారంగా ఎడ్లబండి లోంచి దిగింది లహరి.

పాలేరు బండి విప్పి ఎడ్లకు మేత పెట్టడానికి తోలుకెళ్లాడు. ''ఏంటి ఇలా వచ్చావ్?'' అని మురళి అడిగేసరికి ఆశ్చర్యపోవడం ఆమె వంతయింది.

''లహరిని చూడకుండా ఉండలేకపోతున్నాను, ఓసారి పొలానికి రమ్మని చెప్పండి అని నువ్వు కబురుపెడితే వచ్చాను. ఇంతకీ... నువ్వు చెప్పలేదా?'' లోతుగా చూసింది.

''నేనేం చెప్పలేదే!''

''మరెవరు చెప్పి ఉంటారబ్బా?'' సాలోచనగా అంది లహరి.

''ఎవరూ చెప్పి ఉండరు. బావను చూడాలనిపించి నువ్వే వచ్చేసి ఉంటావ్'' గొంతులో చిలిపితనం ఒలికిస్తూ నవ్వాడు.

''ఏం కాదు. అయినా నాకు రావాలని ఉన్నా... అంత ధైర్యం లేదులే''

''ఎవరైతేనేంలే. నిన్నిలా కలుసుకునే అదృష్టాన్ని నాకు ప్రసాదించారు. వాళ్లు నిజంగా వరాలిచ్చే దేవతామూర్తులే'' అన్నాడు మురళి నాటకీయంగా. వాళ్లు కలుసుకోవాలనే ఉద్దేశ్యంతో లహరి ఆడబడుచు అల్లరిపిల్ల సుశీలే ఆ ఏర్పాటు చేసిందని ఆ ఇద్దరికీ తెలీదు.

తనను చూసిన తర్వాత బావలో కలిగిన కొత్త ఉత్సాహాన్ని గమనించి గలగలా నవ్వేసింది లహరి.

ఆమె నవ్వునలాగే తదేకంగా చూస్తూ అన్నాడు. ''లహరీ నీకు చాలా చెప్పాలనుంది. చాలా అడగాలనీ ఉంది.''

''ఏం చెప్పాలనుంది. మరి ఇంకేం అడగాలనుంది?'' తనదైన సహజమైన అల్లరితనంతో కొంటెగా అడిగింది.

## తేడా

**హాలీవుడ్ సినిమాలకి, బాలీవుడ్ సినిమాలకీ మధ్య ఎంతో తేడా ఉంటుంది. అయితే అక్కడ మన వాళ్ళెవరైనా పనిచేస్తే మరికొన్ని సంగతులు తెలుస్తాయి. అన్నట్టు మల్లికా షెరావత్‌ని కదిపితే హాలీవుడ్, బాలీవుడ్ సినిమాలకున్న తేడాల గురించి అనర్గళంగా చెబుతోంది. 'ఇక్కడితో పోలిస్తే హాలీవుడ్ సినిమాల బడ్జెట్ ఎక్కువ. టాలెంట్ చూపించడానికి, మన గురించి, మన సత్తా గురించి తెలుసుకోవడానికి అవకాశం ఉంది' అంటోంది. మల్లికా పనితీరు జాకీచాన్‌ని కూడా ఆకట్టుకుంటోంది.**



''రహస్యాలు'' అన్నాడు రహస్యంగా.

''మరి చెప్పు'' అతనికి సమీపంగా జరిగి చెవిలో చెప్పమన్నట్టుగా కాస్త తల వంచింది.

ఆ కాస్త దగ్గరితనానికే అతని హృదయం తమ్మిలేటి వరదలా ఉప్పొంగింది.

''ఇక్కడ కాదు. చెరకు తోటలో చెప్తాను.''

''అమ్మో వద్దు. ఇక్కడే చెప్పు.''

''భయమెందుకు? నేనున్నాగా!''

''అందుకే భయం.''

''నిన్నేం కొరుక్కు తిననులే.. పద..''

''ఊహు.. నేను రాను.''

''ప్లీజ్ లహరి.. ప్లీజ్''

''సరే పద..'' నవ్వుతూ అతని వెనుక నడిచింది. చెరకుతోట మధ్యలోకి చేరుకున్నారిద్దరూ... ఇప్పుడు చెప్పమన్నట్టు సైగ చేసింది లహరి.

ఏదో చెప్పబోతున్నట్టుగా కొంచెం ముందుకు వంగి, ఊహించని వేగంతో ఆమెని గాఢంగా హృదయానికి హత్తుకున్నాడతడు. ఆమె తనువంతా పులకింతలు పూలై పూయగా, ఆ మకరందం ఆమె గుండె గదిని మధురంగా పరచుకుంది. ఆమెకెంతసేపైనా అలా ఉండాలనే ఉంది. కానీ స్త్రీ సహజమైన సిగ్గు, సంప్రదాయబద్ధమైన సంస్కారం మది తలుపు తట్టగా బావ చేతుల్లోంచి విడివడాలని ప్రయత్నించింది. కానీ అతడు పట్టు సడలించలేదు. ఆమె అభ్యర్థించినా వినలేదు.

''ప్లీజ్ బావా.. వదులు''

''ఊహు.. వదలను''

''నీకే చెప్పేది.. వదులు''

''సరే అయితే.. ఒక ముద్దివ్వు వదులుతాను'' మురళి మెలిక పెట్టాడు. ఆమె బింకంగా చూసింది.

''అవన్నీ పెళ్లయ్యాకే...''

''పెళ్లయ్యేదాకా గుర్తుండేలా ఒక ముద్దివ్వు చాలు.''

''ఊహు..'' తల అడ్డంగా ఊపింది.

''అలా అంటే ఏమాత్రం కుదరదు.. ఇవ్వాల్సిందే. నేను పది అంకెలు లెక్కపెట్టే లోపుగా ఇచ్చెయ్యాలి'' అంటూ కళ్లు మూసుకుని ముఖాన్ని ముందుకు వంచాడు.

''ఒకటీ... రెండూ... మూడు''

లహరికి ఇప్పుడది ఇష్టం లేని విషయం. సంకోచంగా ఉంది. శరీరం సన్నగా కంపిస్తోంది. కానీ బావ పట్టుదలగా ఉన్నాడు. ఏం చేయాలో అర్థం కావట్లేదా

మెకు.

''నాలుగు... ఐదూ... ఆరు'' బావ లెక్కపెడుతూనే ఉన్నాడు.

లహరి నుదుటిపై చిరు చెమటలు పడుతున్నాయి.

''ఏడు... ఎనిమిది...'' చివరికొచ్చేస్తున్నాడు.

''తొమ్మిదీ...'' చివరికొచ్చేస్తున్నాడు. వచ్చేశాడు.

''పది...'' అయిపోయింది. లహరి ఇంకేం ఆలోచించలేదు.

గబుక్కున తన జడలోనున్న ఎర్రగులాబీని తీసి అతని పెదాల మీద వత్తింది మెత్తగా. వెంటనే అక్కడ్నించి పరుగుపెట్టింది.

అధర మధుర స్పర్శ కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న అతనికి ఆశాభంగమే అయింది.

''ఏయ్ లహరీ నిన్నూ...చూడు నిన్నేం చేస్తానో...'' ఆమె వెనుకే పరుగెట్టాడు.

అతనికి అందకుండా తప్పించుకుంటూ పరుగెడుతున్న ఆమె అడ్డుగా ఉన్న కొమ్మ తగిలి పడిపోయింది.

''అరెరే...పడిపోయావా? లే లే...నెమ్మదిగా'' చెయ్యందించాడు.

''దెబ్బేమైనా తగిలిందా? ఏదీ నన్ను చూడనీ...'' దగ్గరగా రాబోయాడు.

''ఏం కాలేదు. బాగానే ఉన్నాను'' నవ్వుతూ చెప్పిందామె.

ఇంతలో ఎవరివో మాటలు వినిపించేసరికి ''నువ్విక్కడే ఉండు'' అంటూ తను మాత్రం తోటలోనించి వడివడిగా బయటికి వచ్చాడు మురళి. అక్కడ అతడి తండ్రి వెంకటయ్య, బెల్లం వ్యాపారి సత్యంబాబు ఉన్నారు.

చెరకుతోట బేరమాడి తీసుకొని, బెల్లం కుందులు పట్టించి పట్నంలో షాపులకి వేయడం సత్యంబాబు నిత్యవ్యాపారం.

''లోపలేం చేస్తున్నావురా?'' అప్పుడే తోటలోంచి బయటకు వచ్చిన కొడుకును చూస్తూ అడిగాడు.

''అబ్బే! ఏం లేదు నాన్నా...దవ్వలు ఎంతమేరకు ఉన్నాయోనని చూస్తున్నాను, అస్సలు లేవు...''

వెంకటయ్య ఒక చెరకు విరిచి సత్యంబాబుకి చూపించాడు.

''చెరకు పేరేమిటి?''

''మెరుపుతీగ.. రుచి చూస్తే అమృతమే.''

''ఇప్పుడే నరికించి తోలుకెళ్తాను'' మరో మాటకు అవకాశం లేకుండా అన్నాడు సత్యంబాబు.

మురళి కంగారుపడిపోయాడు. ఇప్పుడు చెరకు తోట నరికితే లహరి కనిపిస్తుంది. తమ బండారం బట్టబయలవుతుంది.

''ఇప్పుడు కాదు, రేపు తీసుకెళ్లండి'' అనేశాడు.

''రేపటివరకూ ఎందుకురా?'' అన్నాడు వెంకటయ్య.

''ఈరోజు మంచిది కాదు. ఈ ఒక్కరోజు ఆగండి. రేపు నేనే దగ్గరుండి బండికెక్కిస్తాను'' అంటూ అబద్ధం చెప్పేశాడు మురళి.

వాళ్ల మాటలు విని నవ్వాపుకున్న లహరి, రహస్యంగా అక్కడినుంచి ఎప్పుడో బయటపడింది. తర్వాత మురళి చూస్తే ఆమె కనిపించలేదు. లహరి తిని వదిలివేసిన మెరుపుతీగ వెక్కిరిస్తూ కనిపించింది.

ఆ గడనందుకుని ముక్క కొరుకుతూ...లహరి గులాబి పువ్వుని తన పెదవుల కందించిన వైనం గుర్తొచ్చి చిన్నగా నవ్వుకున్నాడు.

ఆమె సమయస్ఫూర్తికి మనసులోనే అభినందనలందించాడు.

★ ★ ★

నెల తిరక్కుండానే వాళ్లిద్దరికీ ముడిపడిపోయింది. ఆరోజే శోభనం.

లహరికి దగ్గరగా వచ్చి, ఆమెని తన బాహులతల మధ్య బలంగా బంధిస్తూ అన్నాడు మురళి.

''ఆరోజు తోటలో ముద్దివ్వమంటే గులాబీపువ్వును పెదాలకందించి పారిపోతావా?''

'మరి ఇప్పుడేం చేస్తావ్? చెప్పు చూద్దాం' అన్నట్టుగా కళ్లలోకి కళ్లు పెట్టి చూశాడు.

''ఈ మెరుపుతీగెనందిస్తా'' పక్కనే టేబుల్ మీద ప్లేటుతో ఉన్న మెరుపుతీగ ముక్కని చటుక్కున తీసి అతని నోటికందించింది.

ఆమె అలా చేస్తుందని ఊహించని అతను అప్రయత్నంగా పట్టు సడలించాడు.

వెంటనే అతడి చేతుల నుండి విడివడి మంచానికి అవతలగా పరుగుతీసి బొటన వేలు చూపిస్తూ అల్లరిగా వెక్కిరించింది.

''ఏయ్ దొంగా! చూడు నిన్నేం చేస్తానో'' అంటూ మరదలి వైపు పరుగెత్తాడు మురళి. బావా మరదళ్ల సరసాలింతే కాబోలు... ఇలా ఎంతసేపు ఆడుకుంటారో... అస్సలర్థం కాలేదు, కిటికీలోంచి ఆసక్తిగా చూస్తున్న అమాయకపు చందమామయ్యకు.

☆

## ఆలోచన

**కెరీర్‌కున్న విలువని దృష్టిలో ఉంచుకుని మిగతా వ్యక్తిగత వ్యవహారాల్ని కొన్నాళ్ళ పాటు వాయిదా వేసుకోవాలనుకుంటోంది బెంగాలీ బేబీ బిపాషాబసు. నేను నటించే చిత్రాలు నా కెరీర్‌తో పాటూ నిర్మాత, దర్శకులకి కూడా సంతృప్తిని ఇవ్వాలంటోంది బిపాషా. 'నాకు నా పాత్ర ఎలాంటిదో కావాలి. అంతేగానీ అది భారీ బడ్జెట్ చిత్రమా, చిన్న బడ్జెట్ చిత్రమా అనేది ముఖ్యం కాదు' అని చెబుతోంది.**

